సాక్షి అనకాపల్లి

సోమవారం । 8 । మే । 2023



అలల సంద్రంపై.. 8లో

కడలే వారికి అమ్మ ఒడి. అలల సవ్వడులు వారికి జోలపాట. సాగరంలో వేటే జీవనంగా సాగుతున్న మత్స్యకారుల జీవనశైలి విభిన్నం.



పేదింటి విద్యా కుసుమాలు

పేదరికాన్ని అధిగమించారు. కూలిపనులు చేసుకుంటూ జీవిస్తున్నవారి ఇళ్లల్లో విద్యా కుసుమాలుగా నిలిచారు. 8లో



ఆనాటి మధుర స్మృతుల్లో..

ఆనాటి జ్ఞాపకాలనే, నేటి మధుర స్మృతులుగా గుర్తు చేసుకుంటూ పూర్వ విద్యార్థులు పరవశించిపోయారు. 8లో

భళా సర్కారు బడి

- పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలలు
- ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు మించి ఫలితాలు
- రాష్ట్ర స్థాయి టాపర్స్‌గా నిలిచిన జిల్లా విద్యార్థులు
- 11 పాఠశాలల్లో నూరుశాతం ఉత్తీర్ణత
- 1,712 మందికి 500కు పైగానే మార్కులు



అచ్యుతాపురం ఏపీ రెసిడెన్షియల్ బాలికల హైస్కూల్



వందశాతం ఉత్తీర్ణత సాధించిన ఎస్.రాయవరం మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల

సాక్షి, అనకాపల్లి: పదో తరగతి ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అదరహో అనిపించారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లను మించి ఫలితాలు సాధించారు. 11 ప్రభుత్వ పాఠశాలలు శత శాతం ఉత్తీర్ణత సాధించాయి. 90 శాతం ఫలితాలు సాధించిన పాఠశాలలు 38, 80 శాతం సాధించినవి 59, 70 శాతం సాధించినవి 53, 60 శాతం సాధించినవి 63, 50 శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ పాఠశాలలు 27 ఉన్నాయి.

జిల్లాలోని 267 ప్రభుత్వ పాఠశాలల్లో 73 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత శాతం సాధించారు. 1,712 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు పొందారు. అచ్యుతాపురం ఏపీ గురుకుల పాఠశాల విద్యార్థిని కామిరెడ్డి హేమశ్రీ(594), మాకవరపాలెం మండలం గిడుతూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని సింగంపల్లి తనూజ(593), నర్సీపట్నం జెడ్పీ మెయిన్ స్కూల్ విద్యార్థి కొరుప్రోలు ఓంకార్(591) రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపారు. కామిరెడ్డి హేమశ్రీ జిల్లా టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంజినీర్ కావడమే తన ఆశయమని చెప్పింది. సింగంపల్లి తనూజ ద్వితీయ స్థానంలో నిలిచారు.

ఇదే స్ఫూర్తితో అడ్వాన్స్‌డ్ పరీక్షలపై ప్రత్యేక ఫోకస్ పెట్టడం ద్వారా జిల్లాలో నూరుశాతం ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో విద్యాశాఖాధికారులు కార్యాచరణలోకి దిగారు. ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం సోమవారం నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు.

గత ఏడాది కంటే మెరుగైన ఫలితాలు

గత ఏడాది కంటే మెరుగైన ఫలితాలు రావడంతో అనకాపల్లి జిల్లా ఈ ఏడాది రాష్ట్రంలో ఐదో స్థానం దక్కించుకుంది. ఇది సమష్టి విజయమని విద్యాశాఖాధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉత్తీర్ణతలో బాలురు కంటే బాలికలదే పైచేయి. జిల్లాలో 399 ఉన్నత పాఠశాలల్లో 22,151 విద్యార్థులకు గాను 17,221 మంది ఉత్తీర్ణత సాధించారు. 267 ప్రభుత్వ పాఠశాలల నుంచి 17,298 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా.. అందులో 12,620 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అంటే 73 శాతం ఉత్తీర్ణత ప్రభుత్వ పాఠశాలల నుంచే ఉంది. వీరిలో ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 8,637 మంది, సెకండ్ క్లాస్‌లో పాస్ అయినవారు 2761 మంది, థర్డ్ క్లాస్‌లో పాస్ అయినవారు 1222 మంది ఉన్నారు. 500 మార్కులకు పైగా సాధించిన వారు 3,248 మంది వరకు ఉన్నారు. వీరిలో 1,712 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు.

శత శాతం సాధించిన పాఠశాలలు ఇవే...

జిల్లాలో 11 ప్రభుత్వ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. వీటిలో ఐదు జిల్లా పరిషత్ హైస్కూళ్లు, ఒక ప్రభుత్వ పాఠశాల, రెండు ఏపీఎస్ డబ్ల్యూఆర్ఎస్(ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లు), ఒక ఏపీఎంఎస్, ఒక కేజీబీవీ, ఒక మోడల్‌స్కూల్ ఉన్నాయి. కేజీబీవీ(చీడికాడ), ఏపీ మోడల్ స్కూల్(మందాల), ఏపీ సోషల్ వెల్ఫేర్ పాఠశాల(దేవరాపల్లి), బీసీ వెల్ఫేర్(ఎస్.రాయవరం), ఏపీ గురుకుల పాఠశాల(అచ్యుతాపురం), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(కలిగట్ల), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బైలపూడి), ప్రభుత్వ ఉన్నత పాఠశాల(చీడికాడ) శతశాతం ఉత్తీర్ణత సాధించాయి.

ఫెయిల్ అయిన విద్యార్థులకు క్లాసులు..

పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోకుండా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. జూన్ 2 నుంచి 10 వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగనున్నాయి. వీటికి హాజరయ్యే విద్యార్థులు ఆదివారం నుంచి ఈ నెల 17 వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారు. విద్యార్థుల జవాబు పత్రాలను పరిశీలించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఈ నెల 13 లోపు రూ.1000 చెల్లిస్తే జవాబు పత్రాల రీ-వెరిఫికేషన్ చేసుకోవడంతో పాటు, వాటి జెరాక్స్ ప్రతులను విద్యార్థులు పొందవచ్చు. అదే విధంగా రీకౌంటింగ్ కోసం అయితే రూ.500 చెల్లించాలి. సోమవారం నుంచి క్లాసులు ప్రారంభించనున్నారు.

58 మందికి 500 పైగా మార్కులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో 75 మంది పది పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 58మందికి 500కి పైగా మార్కులు లభించాయి. గత ఏడాది కూడా ఈ పాఠశాల శత శాతం ఉత్తీర్ణత సాధించింది. మండలంలోని ప్రభుత్వం పాఠశాలల్లో చదివిన 126 మంది విద్యార్థులు 500కు పైబడి మార్కులు సాధించడం విశేషం.

అదరగొట్టిన జుత్తాడ విద్యార్థులు

చోడవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉత్తమ ఫలితాలను అందిస్తుందనడానికి జుత్తాడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులే నిదర్శనం. ఈ పాఠశాల నుంచి ఆంగ్ల మాధ్యమంలో 28 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 26 మంది ఉత్తీర్ణులయ్యారు.

మహాత్మా జ్యోతిబాపూలే.. ఫుల్ జోష్

ఎస్.రాయవరం: మండలంలోని లింగరాజుపాలెంలో గల మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల టెన్త్ ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించింది. పరీక్షలకు హాజరైన 22 మంది విద్యార్థులూ ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 14 మంది ఐదు వందలకు పైగా మార్కులు పొందారు. మిగిలిన ఎనిమిది మంది ప్రథమ శ్రేణి మార్కులు తెచ్చుకున్నారు. ఇందులో లోకవరపు రేష్మ 582 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

ఐదోస్థానం హర్షణీయం

ఎంపీ సత్యవతి



అనకాపల్లిటౌన్: టెన్త్ పరీక్షా ఫలితాల్లో రాష్ట్రంలో అనకాపల్లి జిల్లా ఐదోస్థానంలో నిలవడం హర్షణీమని ఎంపీ సత్యవతి అన్నారు. తన కార్యాలయంలో ఆమె ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులందరికీ ఆమె అభినందనలు తెలిపారు. తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా విద్యార్థులు నడుచుకోవాలని సూచించారు. ఫెయిల్ అయిన విద్యార్థులు నిరాశ చెందవద్దన్నారు.

అందరి కృషితో..

ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల కృషితో మంచి ఫలితాలు సాధించగలిగాం. స్టడీ అవర్స్‌లో విద్యార్థులు బాగా చదివారు. క్రమ శిక్షణతో చదవడం వల్ల శతశాతం ఉత్తీర్ణత సాధ్యమైంది.

– మధు, ఏపీ రెసిడెన్సియల్ బాలికల స్కూల్, అచ్యుతాపురం

ఇంజనీర్ కావాలన్నదే లక్ష్యం



తనూజ

మాకవరపాలెం: మండలంలోని గిడుతూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న తనూజ 593 మార్కులు సాధించి, ఆదర్శంగా నిలిచింది. ఉపాధ్యాయుల సూచనలు, టెస్టు బుక్స్ చదవడంతోనే అధిక మార్కులు సాధించగలిగానని చెప్పింది. ఇంటర్ పూర్తి చేసి, ఇంజనీర్ కావాలన్నదే తన లక్ష్యమని చెప్పింది.



ఎస్.రాయవరం మండల టాపర్‌గా నిలిచిన రేష్మకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా..



ఓంకార్

నర్సీపట్నం: సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడతానని నర్సీపట్నం జెడ్పీ మెయిన్ స్కూల్ విద్యార్థి కొరుప్రోలు ఓంకార్ తెలిపాడు. పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఓంకార్ 591 మార్కులు సాధించి మండలంలో విజయకేతనం ఎగురవేశాడు. ఉపాధ్యాయులు ఇచ్చిన ప్రోత్సాహం, ప్రణాళిక ప్రకారం చదవటం ద్వారా అధిక మార్కులు సాధించానని చెప్పాడు. ఇంటర్మీడియెట్, అనంతరం ఇంజనీరింగ్ చేస్తానని తెలిపాడు. ఓంకార్ తండ్రి రమణ ఓ ప్రైవేట్ సంస్థలో డ్రైవర్‌గా పని చేస్తున్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివించాం



పాఠశాలలో 10 వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను ప్రణాళికాబద్ధంగా చదివించాం. ఇద్దరు విద్యార్థులు టాపర్లుగా వస్తారనుకున్నాం. ఒకరు వచ్చారు. పాఠశాల ప్రారంభం నుంచి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. జిల్లా విద్యాశాఖ అధికారులు, పాఠశాల కమిషనర్ పర్యవేక్షించారు.

– లక్ష్మీప్రసన్న, ప్రిన్సిపాల్, మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల, ఎస్.రాయవరం మండలం

ఆనంద హేల



రెడ్డి మౌళి (584)



వేచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

దేవరాపల్లి: మండలంలోని 11 ప్రభుత్వ పాఠశాలలకు గాను ముషిడిపల్లి, ఎ.కొత్తపల్లి, వేచలం, కలిగొట్ల జెడ్పీ హైస్కూళ్లతో పాటు తెనుగుపూడి గురుకుల విద్యాలయం శత శాతం ఉత్తీర్ణత సాధించాయి. వేచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రెడ్డి మౌళి 584 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన తమ కుమారుడు మండల టాపర్‌గా నిలవడం పట్ల అతని తల్లిదండ్రులు శ్రీనివాసు, కాసు ఆనందం వ్యక్తం చేశారు. తెనుగుపూడి బాలుర గురుకుల విద్యాలయానికి చెందిన జి. మనోహర్, దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల చెందిన కె.సందీప్ 578 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచారు. అలాగే బేతపూడి కేజీబీవీకు చెందిన ఎస్. వెంకటలక్ష్మి 565 మార్కులతో బాలికల విభాగంలో మండల స్థాయిలో అగ్ర స్థానంలో నిలిచింది. విద్యార్థులు అధిక మార్కులు సాధించడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఇది సమష్టి కృషి ఫలితం



మా హైస్కూల్ (వేచలం) శతశాతం ఉత్తీర్ణత సాధించింది. వేచలంకు చెందిన రెడ్డి మౌళి 584 మార్కులు సాధించి మండల స్థాయిలో టాపర్‌గా నిలవడం ఆనందంగా ఉంది. మా పాఠశాలలోని ఉపాధ్యాయులంతా సమిష్టి కృషి ఫలితంగా మంచి మార్కులు వచ్చాయి.

–డి. నర్సింహమూర్తి, హెచ్ఎం, వేచలం

ప్రత్యేక తరగతులు నిర్వహించాం



పదవ తరగతి విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ప్రతీ రోజు చెప్పిన పాఠ్యాంశాలపై ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాం. సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు వారి సందేహాలను నివృత్తి చేసేవారు. ఈ నేపథ్యంలోనే పాఠశాలలోని 26 మందికి 26 పాసై శతశాతం ఉత్తీర్ణత సాధించారు. అత్యధికంగా గంగా షర్మిల 549 మార్కులు సాధించగా, 22 మంది ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారు.

–వై. స్వర్ణలత, హెచ్ఎం, ఎ.కొత్తపల్లి.

న్యూస్‌రీల్

జగనన్న కాలనీలు నిరుపేదలకు వరం

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం బూడి

మాడుగుల: జగన్న కాలనీలు నిరుపేదలకు వరంగా మారాయని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలో గాదిరాయిలో జగనన్న కాలనీలో జరిగిన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కాలనీల్లో విద్యుత్ సదుపాయంతో పాటు తాగు నీరు తదితర సదుపాయాలను ఇప్పటికే కల్పించినట్టు చెప్పారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన వారికి ఉచితంగా విద్యుత్ మీటర్లు అందజేస్తున్నట్టు తెలిపారు. జగన్న కాలనీలు సకల సదుపాయాలతో మోడల్ కాలనీలుగా మారనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకట రాజారామ్,వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు పత్రే రాము నాయుడు, సచివాలయ కన్వీనర్ పత్రే వెంకట రమణ తదితరులుపాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

డీఎంఅండ్‌హెచ్‌వో హేమంత్



వైద్య, రక్తదాన శిబిరంలో బీపీ చెక్ చేస్తున్న డాక్టర్ హేమంత్

చోడవరం: రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ హేమంత్ అన్నారు. స్థానిక ఉషోదయ కాలేజీ ఆవరణంలో సీడీవీఎం కమ్యూనిటీ సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా ఉచిత వైద్య, రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో చోడవరం పట్టణంలో ఉన్న అన్ని ఆస్పత్రుల వైద్యులు పాల్గొని సుమారు 250 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు చేసి, మందులు అందజేశారు. రక్తదాన శిబిరంలో 40మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఆరోగ్యంపై పూర్తిగా శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ నిర్వాహకుడు కొప్పాక రాజేష్, ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జెర్రిపోతుల రమణాజీ, అడమ్స్ వెంకట్రావు, గణేష్ డిఫెన్స్ అకాడమీ డైరక్టర్ పుల్లేటి గణేష్, పతంజలి యోగా గురువు పుల్లేటి సతీష్, ఎస్ఎల్‌పీడీ మూర్తి పాల్గొన్నారు.

బ్యాంకు దోపిడీకి విఫలయత్నం



ఎస్‌బీఐ స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న ఎస్‌ఐ

రాంబిల్లి: స్థానిక ఎస్‌బీఐలో దోపిడీకి విఫలయత్నం జరిగింది. శనివారం రాత్రి రెండు గంటల తర్వాత దుండగులు బ్యాంకులోకి ప్రవేశించినట్టు ఎస్ఐ దీనబంధు తెలిపారు. దొంగలు స్ట్రాంగ్‌రూం డోర్ తీస్తుండగా సైరన్ మోగడంతో పక్కనే నివసిస్తున్న రాజు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. హుటాహుటిని బ్యాంకు దగ్గరకు పోలీసులు చేరుకున్నారని, అప్పటికే దొంగలు పరారయ్యారని ఎస్ఐ తెలిపారు. ఆదివారం క్లూస్‌టీం పరిశీలించిదని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

నేడు డయల్ యువర్ మేయర్, స్పందన

దాబాగార్డెన్స్: మేయర్ గొలగాని హరి వెంకట కుమారి సోమవారం తన ఛాంబర్‌లో డయల్ యువర్ మేయర్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు టోల్ ఫ్రీ నంబర్ 1800 4250 0009 ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో జరిగే స్పందన కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మతో కలిసి పాల్గొంటారు.

యువతకు స్ఫూర్తి అల్లూరి



అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



అల్లూరి సమాధి వద్ద నివాళులు

తుమ్మపాల: స్వాతంత్ర్య సమర యోధుడు, విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజును యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పి.వెంకటరమణ పాల్గొన్నారు.

ఘన నివాళి

గొలుగొండ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు పలువురు ఘనంగా నివాళులర్పించారు. 100వ వర్ధంతి సందర్భంగా కృష్ణదేవిపేట అల్లూరి పార్కులోని సమాధుల వద్ద ఆదివారం నర్సీపట్నం ఆర్డీవో జయరాం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అల్లూరి కాంస్య విగ్రహానికి, అల్లూరి తల్లి నారాయణమ్మ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ చిన్న వయస్సులో దేశం కోసం ప్రాణాలు అర్పించిన అల్లూరి ఆశయ సాధన కోసం అందరూ కృషిచేయాలన్నారు. ఇటువంటి మహనీయుల పోరాటం వల్ల కృష్ణదేవిపేటకు మంచి గుర్తింపు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆనందరావు, సర్పంచ్ లోచల సుజాతతో పాటు రెవెన్యూ అధికారులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నీట్‌గా రాశారు

- ప్రశాంతంగా నీట్
- 98.33 శాతం హాజరు



ప్రమాదంలో గాయపడినా పరీక్ష రాయాల్సిందే..



తన ఆభరణాలను తీసేస్తున్న విద్యార్థిని



కేంద్రీయ విద్యాలయం వద్ద పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థుల పత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

ఆరిలోవ(విశాఖ తూర్పు): జిల్లాలో నీట్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు ఈ పరీక్ష జరిగింది. నగరంలో 16 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా.. విద్యార్థులు ఉదయం 11 గంటల నుంచి చేరుకున్నారు. అన్ని కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు నిర్వహించారు. నిబంధనల ప్రకారం నిషేధించిన వస్తువులను పరీక్ష హాల్‌లోకి తీసుకెళ్లకుండా విద్యార్థులను తనిఖీ చేశారు. జిల్లాలో 7,978 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేయగా.. 7,845 మంది(98.33 శాతం) విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 133 మంది గైర్హాజరైనట్లు డీఆర్‌వో శ్రీనివాసమూర్తి తెలిపారు.

విశాఖకు మరో మణిహారం సీ-హారియర్

సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన విశాఖ కలెక్టర్ మల్లికార్జున



వైఎస్సార్ విగ్రహం ఏర్పాట్లను పరిశీలిస్తున్న విశాఖ కలెక్టర్, సీపీ, జీవీఎంసీ కమిషనర్

దొండపర్తి(విశాఖ దక్షిణ): బీచ్ రోడ్డులో ప్రారంభానికి సిద్ధమవుతున్న సీ-హారియర్ మ్యూజియం విశాఖకు మరో మణిహారంగా మారుతుందని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 11వ తేదీన విశాఖలో పర్యటిస్తున్న దృష్ట్యా పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మలతో కలిసి ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. సీ-హారియర్ యుద్ధ విమాన మ్యూజియం, వైఎస్సార్ క్రికెట్ స్టేడియం, ఆరిలోవ అపోలో ఆస్పత్రి ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో ఏర్పాటు చేసిన సీ-హారియర్ మ్యూజియం విశాఖ వాసులకు, పర్యాటకులకు మరింత ఆహ్లాదాన్ని పంచుతుందన్నారు. టీయూ-142, కురుసుర సబ్ మెరైన్‌తో పాటు సీ-హారియర్ మ్యూజియం కూడా అందుబాటులోకి రావడంతో విద్యార్థులు, యువత ఎన్నో విషయాలు తెలుసుకోడానికి అవకాశం కలుగుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా దీన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ మాట్లాడుతూ ఈ మ్యూజియం ద్వారా యువత, పిల్లలు ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చన్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటవుతున్న సీ-హారియర్ మ్యూజియం పర్యాటకులకు సరికొత్త అనుభూతిని పంచుతుందన్నారు. అనంతరం వైఎస్సార్ క్రికెట్ స్టేడియం వద్ద ముఖ్యమంత్రి హెలిప్యాడ్ పనులు పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. స్టేడియం వద్ద ఏర్పాటు చేయనున్న దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద కార్యక్రమ ఏర్పాట్లపై చర్చించారు. అక్కడి నుంచి ఆరిలోవలో అపోలో క్యాన్సర్ ఆసుపత్రిలో కార్యక్రమ ఏర్పాట్లపై ఆసుపత్రి నిర్వాహకులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జేసీ కె.ఎస్.విశ్వనాథ్, భీమిలి ఆర్డీవో భాస్కర్ రెడ్డి, వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ, ఆర్ అండ్ బీ, పోలీస్, ఫైర్, ఏపీఈపీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

సింహగిరి ఘాట్‌రోడ్డులో బస్సు బ్రేక్ ఫెయిల్



ఘాట్‌రోడ్డులో నిలిచిన బస్సు

సింహాచలం: సింహగిరి ఘాట్‌రోడ్డులోఆర్టీసీ బస్సు బ్రేకులు ఫెయిల్ అయి వెనక్కి వెళ్లడంతో.. అందులో ప్రయాణిస్తున్న భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు. ఆదివారం ఉదయం సుమారు 11గంటల సమయంలో ఆర్టీసీ బస్సు 10 మంది ప్రయాణికులతో కొండపైకి వెళ్తోంది. టోల్‌గేట్ దాటగానే ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఉన్న ఎగువ భాగంలో మలుపు తిరుగుతుండగా బ్రేక్‌లు ఫెయిల్ అవడంతో కుడి పక్కన ఉన్న కొండను ఢీకొట్టింది. వెనక్కి వెళ్లి.. మెట్ల మార్గానికి, ఘాట్ రోడ్డుకు మధ్యలోని రైలింగ్‌ను ఢీకొని నిలిచింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. రైలింగ్ ఉండటంతో బస్సు నిలిచిందని, లేకపోతే మెట్లమార్గంలోకి దూసుకెళ్లేదని భక్తులు తెలిపారు.

ఆర్మీ ఉద్యోగికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

మహేశ్ మృతదేహం వద్ద నివాళులర్పించిన డిప్యూటీ సీఎం బూడి



గాలిలోకి తుపాకులు పేలుస్తున్న పోలీసులు



మహేశ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

చీడికాడ: ఈ నెల 5న ఢిల్లీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇండియన్ ఆర్మీ ఉద్యోగి మధుమంతి మహేశ్ మృతదేహానికి ఆదివారం సాయంత్రం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మహేశ్ మృతదేహాన్ని ఆదివారం ఢిల్లీ నుంచి విమానంలో విశాఖ ఎయిర్‌పోర్టుకు తీసుకొచ్చారు. అక్కడ నుంచి దిబ్బపాలెం గ్రామానికి ప్రత్యేక వాహనంలో తరలించారు. మహేశ్ మృతదేహం వద్ద డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం దిబ్బపాలెం గ్రామంలో గల శ్మశానవాటికలో ప్రభుత్వ లాంఛనాలతో సైనికులు మూడుసార్లు గాల్లోకి కాల్పులు జరిపారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహం వద్ద భార్య ఉమా, తల్లి, ఇతర కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ అంత్యక్రియలకు స్థానిక పోలీసులు హాజరయ్యారు.

క్లుప్తంగా

600 లీటర్ల పులుపు ధ్వంసం



పులుపు ధ్వంసం చేస్తున్న కొత్తకోట పోలీసులు

రావికమతం: ఆర్.కొత్తూరు గ్రామ శివారు పొలాల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల పులుపును, పలు రకాల మెటీరియల్‌ను కొత్తకోట పోలీసులు ఆదివారం ధ్వంసం చేశారు. ఆ గ్రామంలో పెద్ద ఎత్తున సారా తయారీ చేస్తున్నట్టు తమకు ముందస్తు సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేసి సామాగ్రి పులుపు ధ్వంసం చేశామని ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



ప్రగడ శ్రీను (ఫైల్)

పాయకరావుపేట: మండలంలో గల పెంటకోట గ్రామానికి చెందిన వ్యక్తిని తుని సమీపంలో లారీ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి. పెంటకోట గ్రామానికి చెందిన ప్రగడ శ్రీను కాకినాడలో నివాసముంటున్నారు. పెంటకోటలో తన నాయనమ్మ రాజమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆమె పెద్దకర్మకు హాజరైన శ్రీను తిరిగి కాకినాడ వెళ్తుండగా శనివారం అర్ధరాత్రి అతను ప్రయాణిస్తున్న కారును లారీ ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ప్రగడ శ్రీను (34) అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. శ్రీను మృతితో పెంటకోట గ్రామంలో విషాదం నెలకొంది.

19 కేజీల గంజాయి పట్టివేత

ప్రైవేటు బస్ సీజ్, ముగ్గురి అరెస్టు



పట్టుకున్న గంజాయితో ఎస్‌ఈబీ పోలీసులు

గొలుగొండ: అక్రమంగా ప్రైవేట్ బస్‌లో 19 కేజీల గంజాయి తలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు గొలుగొండ ఎస్‌ఈబీ సీఐ రాజారావు తెలిపారు. చిత్రకొండ- నర్సీపట్నం వెళ్లే ప్రవేట్ బస్‌లో 19 కేజీల గంజాయి వస్తున్నట్టు వచ్చిన సమాచారంతో గొలుగొండ మండలం ఏటిగైరంపేట వద్ద దాడి చేసి పట్టుకున్నట్టు తెలిపారు. నర్సీపట్నంకు చెందిన బి.కృష్ణ, లోవ వెంకటరమణ, వెంకటేష్ అనే ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టుకి తరలించామని తెలిపారు. ప్రైవేట్ బస్‌ను సీజ్ చేసామని, వారి నుంచి ఒక సెల్‌ఫోన్, రూ.12వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గిరితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

అలల సంద్రంపై బతుకు విన్యాసం

కడలే వారికి అమ్మ ఒడి. అలల సవ్వడులు వారికి జోలపాట. సాగరంలో వేటే జీవనంగా సాగుతున్న మత్స్యకారుల జీవనశైలి అంతా విభిన్నం. అనుక్షణం ప్రకృతి విసిరే సవాళ్లను ఎదుర్కొంటూ.. నిత్యం ఆటుపోట్ల మధ్య సాగే వీరి జీవనం ఓ సమరం. సంవత్సరంలో 10 నెలలపాటు ఎగిసి పడే కెరటాలను అవలీలగా దాటి సముద్రంలో చేపలవేట సాగించే వీరికి వేట నిషేధ సమయమే విశ్రాంతి. ఆ సమయంలో వీరి జీవనం పెను సవాలే.! ప్రభుత్వం వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం ద్వారా సాయం అందిస్తుండడం కొంత ఉపశమనం కలుగుతోంది.

– విశాఖపట్నం డెస్క్





వలలు తయారీ చేసుకుంటున్న జాలర్లు

సాగర మథనం.. సాహస జీవనం

- మత్స్యకారుల జీవనం విలక్షణం
- సముద్రమే వీరి జీవనాధారం
- వేట నిషేధ సమయంలో జీవన పోరాటం
- వైఎస్సార్ మత్స్యకార భరోసాతో ఉపశమనం

మత్స్యసంపద పరిరక్షణ కోసం సముద్రంలో వేట నిషేధం అమలవుతోంది. ఏపీ మెరైన్ ఫిషింగ్ రెగ్యులేషన్ యాక్ట్ 1995 ప్రకారం సముద్రంలో చేపల వేటపై పలు ఆదేశాలున్నాయి. ఈ చట్టం 1997 నుంచి అమల్లోకి వచ్చింది. 2007 నుంచి 61 రోజుల పాటు వేట నిషేధం అమలవుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ 15న వేట నిషేధం అమల్లోకి రాగా.. జూన్ 15 వరకు కొనసాగనుంది. తొలి రోజుల్లో వేట నిషేధం అమలుకు అధికారులు పలు చోట్ల కష్టపడాల్సి వచ్చేది. కానీ ప్రస్తుతం సులువుగానే వేట నిషేధం అమలవుతోంది. వేట నిషేధం అనంతరం వస్తున్న ఫలితాలతో పాటు కన్నెర్ర చేసిన సంద్రం రూపు చూసిన మత్స్యకారులు అధికారుల ఆదేశాలను పాటిస్తున్నారు.

జిల్లాలో తీర ప్రాంతం	24 కి.మీ
మత్స్యకార గ్రామాలు	15
ఫిష్ లాండింగ్ కేంద్రాలు	30
జిల్లాలో మర పడవలు	687
ఫైబర్ బోట్లు	1272
తెప్పలు	428

మత్స్యకారులు ఏం చేస్తారు?

ఏప్రిల్ 15న వేట నిషేధం అమల్లోకి రాగానే ఫిషింగ్ హార్బర్‌కు బోట్లన్నీ చేరుకుంటాయి. 15వ తేదీ నుంచి 25వ తేదీ వరకు అప్పటి వరకు వేటాడిన మత్స్య సంపద విక్రయాలు, వలలు భద్రపరచుకోవడం తదితర పనుల్లో మత్స్యకారులు నిమగ్నమవుతారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన మత్స్యకారులు వారి స్వగ్రామాలకు వెళ్లిపోతారు. సొంత పనులు చేసుకోవడంతో పాటు ఆలయాలను సందర్శించడం, గ్రామాల్లో దేవత సంబరాలు జరుపుకోవడం తదితర కార్యక్రమాల్లో పాల్గొంటారు. జూన్ 1 నుంచి మళ్లీ ఫిషింగ్ హార్బర్‌కు చేరుకొని వేటకు సమాయత్తమవుతారు. బోటు, వలలను సిద్ధం చేసుకుంటారు. కొందరు మత్స్యకారులు వలలు మరమ్మతులు చేసుకోవడం, అవకాశం ఉన్న వారు నగరంలో భవన నిర్మాణ పనులు, పెయింటింగ్ పనులకు వెళ్తుంటారు. కొందరు తెప్పల్లో మత్స్యవేట సాగిస్తుంటారు. భీమిలి నియోజకవర్గంలోని మత్స్యకారులు సమీపంలోని గోస్తనీలో వేట సాగిస్తుంటారు. ఆయా పనులు దొరకని పక్షంలో ఏదోలా కాలక్షేపం చేస్తుంటారు.

బోసిపోయిన ఫిషింగ్ హార్బర్

వేట నిషేధ సమయంలో ఫిషింగ్ హార్బర్ బోసిపోతుంది. ఎగుమతులు, దిగుమతులు నిలిచిపోతాయి. వినియోగదారులు ఇటువైపు రారు. తెప్పలపై వేట చేసి తెచ్చిన కొద్ది పాటి చేపలను కొంత మంది మహిళలు ఇక్కడ విక్రయిస్తుంటారు. ఎండేసిన నెత్తళ్లు, రొయ్యిలు విక్రయాలు కూడా అంతంతమాత్రంగానే సాగుతాయి. ఎండుచేపలను కూడా కేరళ తదితర ప్రాంతాలను దిగుమతి చేసుకుంటామని మత్స్యకార మహిళలు చెబుతుంటారు. వీధుల్లో చేపలు విక్రయించే మత్స్యకార మహిళలు.. వేట నిషేధ కాలంలో చెరువు చేపల అమ్మకం చేపడుతుంటారు. లేనివారు ఇతరాత్ర పనులకు వెళ్తారు.



ఎండు రొయ్యలు సిద్ధం చేస్తున్న మహిళ

మత్స్యకారులకు భరోసా

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. మత్స్యకారుల జీవితాల్లో చాలా మార్పు వచ్చింది. వేట విరామం సమయంలో గత ప్రభుత్వాలు అరకొర మందికి.. అదీ ఏడాదికి రూ.4 వేలు ఆర్థిక సాయం, 20 కిలోల బియ్యం ఇచ్చి చేతులు దులుపుకునేవి. అయితే ప్రస్తుత ప్రభుత్వం వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఏటా రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తున్నారు. వేట బోట్లకు డీజిల్ సబ్సిడీని గణనీయంగా పెంచారు. ప్రస్తుతం వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకంలో లబ్ధిదారుల ఎంపికకు సర్వే జరుగుతోంది.

వేసవిలోనే నిషేధం ఎందుకు?

వేట నిషేధం సరే.. మరి రెండు నెలలు ఎందుకు? అదీ వేసవిలో ఎందుకు అమలు చేస్తున్నారు? అనే ప్రశ్న అందరిలోనూ ఉత్పన్నమవుతుంది. ఒకప్పుడు బంగాళాఖాతంలో విలువైన జీవరాశులుండేవి. రానురానూ వాటి సంపద తగ్గిపోతోంది. ముఖ్యంగా వేసవిలో గుడ్లు పెట్టే దశలో వేట కారణంగా సంతానోత్పత్తి పడిపోతోంది. ఈ కాలంలో ట్రాల్ ఫిషింగ్ వల్ల సముద్రంలో బెడ్ నాగలితో దున్నినట్లు అయిపోతోంది. దీని వల్ల పునరుత్పత్తికి ఆటంకం ఏర్పడి.. అరుదైన జాతులు కూడా కనుమరుగవుతున్నాయి. ఏప్రిల్ నుంచి జూన్ వరకు సముద్రంలో చేపల గుడ్లు పెట్టేందుకు అనువైన వాతావరణం ఉంటుంది. గుడ్లు పిల్లలుగా మారి వేగంగా ఎదిగేందుకు ఈ ఉష్ణోగ్రతలు దోహదపడాయి. పైగా సముద్రంలో బెడ్‌ను ఆటంకం కలిగించకపోవడంతో చేపలకు ఆహారమైన ప్లవకాలు(జూ ప్లాంక్టన్, ఫైథో ప్లాంక్టన్) వృద్ధి చెందుతాయి. ఇలా చేపల వేట నిషేధం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. బంగాళాఖాతం తీర ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలలోనూ చేపల వేట అమలు చేస్తున్నారు. అందుకే నిషేధిత కాలంలో సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు సూచిస్తున్నట్లు మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ జి.విజయ తెలిపారు.

మత్స్యకార భరోసా అమలు ఇలా...

జిల్లా	సంవత్సరం	లబ్ధిదారులు	జీవన భృతి(రూలో.)
విశాఖ	2022	11,334	11,33,40,000
ఉమ్మడి విశాఖ	2021	22,366	22,36,60,000
ఉమ్మడి విశాఖ	2020	20273	20,27,30,000
ఉమ్మడి విశాఖ	2019	18925	18,92,50,000

విరామ సమయంలో ఇబ్బందులే..



చేపల వేట తప్పించి.. మరో వృత్తి తెలియదు. నిషేధ సమయంలో ఇళ్ల వద్దే ఉంటాం. ఈ రెండు నెలలు జీవనానికి ఇబ్బందులు ఎదురైనా.. మత్స్యసంపద పరిరక్షణకు ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తాం. నాలుగేళ్లగా వైఎస్సార్ మత్స్యకార భరోసా అందుతోంది. ఈ ఏడాది కూడా ఈ పథకానికి అప్లయ్ చేశాను.

– వాసుపల్లి లక్ష్మయ్య

వ్యాపారం అంతంత మాత్రమే..



సాధారణ రోజుల్లో ఫిషింగ్ హార్బర్‌కు ఎక్కువ మంది కొనుగోలుదారులు వస్తారు. తాజా చేపలతో పాటు ఎండు చేపల వ్యాపారం బాగుంటుంది. ప్రస్తుతం వేట నిషేధం అమలులో ఉండటంతో వ్యాపారం అంతంతమాత్రంగానే ఉంది. ఫిషింగ్ హార్బర్ చూడటానికి వచ్చే వారిలో ఎవరైనా ఎండు చేపలు కొంటారు. ప్రస్తుతం ఎండు నెత్తళ్లను ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం.

– సూరాడ తానియమ్మ

చేపల ఉత్పత్తికి అనువైన వాతావరణం



వేసవిలో చేపల సంతానోత్పత్తికి అనువైన వాతావరణం ఉంటుంది. వేట విరామం తర్వాత చేపలు దండిగా పడతాయి. దసరా వరకు చేపల వేట ఆశాజనంగా సాగుతుంది. ఇక వేట నిషేధ కాలంలో కలాసీలు వాళ్ల ఊళ్లకు వెళ్లిపోతారు. యజమానులంతా బోటుకు అవసరమైన మరమ్మతులు చేపడుతుంటారు. ప్రస్తుతం ధరలు మండిపోతున్నాయి. ప్రభుత్వం వేట విరామ జీవనభృతి మరింత పెంచితే బాగుంటుంది.

–చింతపల్లి వీర్రాజు, అధ్యక్షుడు, విశాఖ డాల్ఫిన్స్ బోటు ఆపరేటర్ల అసోసియేషన్

కొట్లాటలో వ్యక్తికి తీవ్రగాయాలు

అనకాపల్లిటౌన్: స్థానిక నూకాంబిక ఆలయంలో ఆదివారం జరిగిన కొట్లాటలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్‌ఐ దివాకర్ అందించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ పూర్ణామార్కెట్‌కు చెందిన వ్యాన్ అసోసియేషన్ సభ్యులు పట్టణంలో గవరపాలెం నూకాంబిక ఆలయం వద్దకు వనభోజనానికి వచ్చారు. మంచినీరు విషయంలో కాకర అప్పలరాజు, దుర్గాప్రసాద్, శ్రీను మధ్య వాగ్వాదం జరిగింది. ఈ ఘర్షణలో దుర్గాప్రసాద్, శ్రీనులు అప్పలరాజును కొట్టి గాయపర్చారు. బాధితుడిని చికిత్స నిమి త్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అప్పలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

యువతి మృతికి కారకుడైన యువకుడికి రిమాండ్

అనకాపల్లిటౌన్: ప్రేమించి మోసపోయిన యువతి బలవన్మరణానికి కారకుడైన యువకుడిని పట్టణ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ దివాకర్ అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలో మూలపేట గ్రామానికి చెందిన అడపా గీత గాయత్రి(24) మూడేళ్ల క్రితం బుచ్చెయ్యపేట గ్రామానికి చెందిన మహేష్‌తో ప్రేమలో పడిందని ఎస్‌ఐ చెప్పారు. ఇటీవల గాయత్రి మహేష్ వద్ద పెళ్లి ప్రస్తావన తీసుకురాగా అనుమానిస్తూ వేధింపులకు పాల్పడడంతో మనస్తాపానికి గురైన గాయత్రి పురుగు మందు తాగి మృతి చెందింది. దీనిపై మృతురాలి తండ్రి వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసి మహేష్‌ను అరెస్టు చేసి స్థానిక న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి


కశింకోట: తాళ్లపాలెం వద్ద జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. వివరాలివి. అనకాపల్లి-యలమంచిలి వైపు వెళ్లే మార్గంలో తాళ్లపాలెం హైస్కూలు వద్ద రోడ్డు దాటుతున్న 45 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తిని కారు ఢీకొనడంతో అతను తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. అతని వివరాలు తెలియరాలేదన్నారు. ఆదివారం వీఆర్‌వో బొడ్డేడ శివాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మాకవరపాలెం: ఆర్టీసీ బస్సును బైకుతో ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. గిడుతూరు గ్రామానికి చెందిన రవి ద్విచక్ర వాహనంపై ఆదివారం మధ్యాహ్నం నర్సీపట్నం వెళుతున్నాడు. కొండల అగ్రహారం ఇమ్మానుయేలు టీబీ ఆస్పత్రి వద్దకు వచ్చేసరికి నర్సీపట్నం వెళుతూ ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో రవికి తల, ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. అతనిని స్థానికులు 108లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు.

ఆనాటి మధుర స్మృతుల్లో..

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



దేవరాపల్లిలో ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

దేవరాపల్లి: ఆనాటి జ్ఞాపకాలనే, నేటి మధుర స్మృతులుగా గుర్తు చేసుకుంటూ పూర్వ విద్యార్థులు పరవశించిపోయారు. వీరంతా ఆదివారం దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆత్మీయంగా కలుసుకుని సందడి చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ మురిసిపోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1991 నుంచి 1996 వరకు విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థులు తమ గురువులను ఒకే వేదికపై ఘనంగా సత్కరించి గురుభక్తిని చాటుకున్నారు. ఈ ఆత్మీయ కలయికకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం మంచి సాంప్రదాయమని అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు పాల్గొన్నారు.

జాతీయ అంధుల సమాఖ్య ఉత్తరాంధ్ర యూనిట్ ఏర్పాటు

డాబాగార్డెన్స్: జాతీయ అంధుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖకు అనుబంధంగా ఉత్తరాంధ్ర యూనిట్‌ను ఏర్పాటు చేశారు. విశాఖ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. ఎస్.అర్జునరావు అధ్యక్షతన ఉపాధ్యక్షులుగా బి. సుమలత, గౌరీశంకర్, చిన్న, ప్రధాన కార్యదర్శిగా కె.సూరిబాబు, సంయుక్త కార్యదర్శులుగా పి.లక్ష్మి, కనకారావు, యువ కార్యదర్శిగా జి.సురేష్, కోశాధికారిగా ఎస్.జోషి కిశోర్‌ను ఎన్నుకున్నారు. సమాఖ్య రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి మోపూరి రామసుబ్బయ్య, ఉపాధ్యక్షుడు ధూళిపాల శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన అంధులు పాల్గొన్నారు.

పేదింటి విద్యా కుసుమాలు



తల్లిదండ్రులతో మండల టాపర్ నాగదుర్గ



తల్లితో ఆనందం పంచుకుంటున్న సత్యపావని

నక్కపల్లి: పేదరికాన్ని అధిగమించారు. కూలిపనులు చేసుకుంటూ జీవిస్తున్నవారి ఇళ్లల్లో విద్యా కుసుమాలుగా నిలిచారు. ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో వేలకు వేలు ఫీజులు చెల్లించి చదువుకున్న విద్యార్థుల కంటే ఎక్కువ మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచారు. జగనన్న ప్రభుత్వం అమలుచేస్తున్న అమ్మఒడి, నాడు-నేడు, విద్యాకానుక పథకాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించారు.

- మండలంలో 580 మార్కులతో టాపర్‌గా నిలిచిన గొడిచర్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థి నార్ని నాగదుర్గది డొంకాడ గ్రామం. తండ్రి తాపీ మేస్త్రీ. రోజూ ఇంటి నుంచి నాలుగు కిలోమీటర్లు సూకిల్‌పై వస్తూ ఈ స్థాయి మార్కులు సాధించాడు. దీంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
- మండలంలో 575 మార్కులతో రెండో స్థానంలో నిలిచిన నక్కపల్లికి చెందిన సత్యపావని తండ్రి చిన్నతనంలోనే కుటుంబాన్ని వదిలేసి వెళ్లిపోయాడు. తల్లి ఇంటివద్ద చిన్నపాటి కిరాణా దుకాణాన్ని నడుపుతూ కుమార్తెని చదివించింది. తమ కుమార్తె కష్టానికి తగిన ఫలితం దక్కిందని ఆమె ఆనందంగా చెప్పింది.
- జానకయ్యపేటకు చెందిన వినీల 572 మార్కులతో మండలంలో మూడో స్థానంలో నిలిచింది. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు.

వీరంతా తాము చదివిన స్కూల్లో జగన్ మామయ్య ప్రభుత్వం పూర్తి సదుపాయాలు కల్పించిందని, చదువుకు అవసరమైన ప్రతి మెటీరియల్‌ను అందించిందని ఆనందంగా వెల్లడించారు. ఉపాధ్యాయుల బోధన, పరీక్షలకు ముందువారు చూపిన శ్రద్ధే తమకు ఈ స్థాయి మార్కులు రావడానికి కారణమని, టీచర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రణాళిక బద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు

పాలిటెక్నిక్ కెమికల్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ రమణ



విద్యార్థులకు సూచనలు చేస్తున్న పాలిటెక్నిక్ కెమికల్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ రమణ

దేవరాపల్లి: సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళిక బద్ధంగా పరీక్షలకు సిద్ధం కావడం ద్వారా మంచి ఫలితాలను సులభంగా సాధించవచ్చునని విశాఖపట్నం పాలిటెక్నిక్ కెమికల్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టరు కె.వి.రమణ తెలిపారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సహాయ సహకారాలతో దేవరాపల్లిలో పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ ఉచిత కోచింగ్ ఇస్తున్నారు. ఆదివారం ఇక్కడ అవగాహన సదస్సుకు ప్రిన్సిపాల్ రమణ విచ్చేశారు. ఈ నెల 10న పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ పరీక్షలకు అవసరమైన మెలకువలు, సలహాలు, సూచనలు అందించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ, మండలాధ్యక్షుడు కొరుపోలు శ్రీను నేతృత్వంలో శిక్షణ పొందుతున్న 80 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిరికి శ్రీనివాసరావు, పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి సిహెచ్. పెద్దినాయుడు, రాష్ట్ర కార్యదర్శి పోతల గోవిందు, ఆదిరెడ్డి ఈశ్వరరావు, కె. జ్ఞానేశ్వరరావు, రమేష్, ఉప్పు అజయ్ పాల్గొన్నారు.

ఫౌండ్రీ పరిశ్రమలో విస్తృత ఉద్యోగావకాశాలు

మురళీనగర్: ఫౌండ్రీ పరిశ్రమలో మెటలర్జీ విద్యార్థులకు విస్తృతమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫౌండ్రీమెన్(ఐఐఎఫ్) సౌత్ రీజియన్ చైర్మన్ ఎస్.ముత్తుకుమార్ చెప్పారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఐఐఎఫ్ స్టూడెంట్ చాప్టర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఐఎఫ్‌లో చేరిన మెటలర్జికల్ విద్యార్థులకు నిపుణులతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఫౌండ్రీ పరిశ్రమల్లో వస్తున్న నూతన సాంకేతిక విధానాలను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. వస్తువులను పోతపోసే విధానాల్లో అనూహ్యమైన మార్పులు చోటుచేసుకున్నట్లు వివరించారు. ఐఐఎఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ ఆర్. అంజనేయప్రసాద్ మాట్లాడుతూ దేశంలోని ఫౌండ్రీ పరిశ్రమ ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. విద్యార్థుల్లో పరిశోధానాత్మక ఆలోచనలు కలిగించడం, సమావేశాల్లో అనర్గళంగా మాట్లాడే నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ఐఐఎఫ్ లక్ష్యమన్నారు. కళాశాల మెటలర్జీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ రత్నకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఐఐఎఫ్ ప్రతినిధి వి.ఎస్ కిశోర్ కుమార్, పలు పరిశ్రమల ప్రతినిధులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఠాగూర్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలి



ఠాగూర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న శివశంకర్

అనకాపల్లిటౌన్ : రవీంద్రనాథ్ ఠాగూర్ గొప్ప సాహితీవేత్త, విద్యావేత్త అని బ్రైట్ స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు కాళ్ల శివశంకర్ అన్నారు. స్థానిక గాంధీనగరం సంస్థ కార్యాలయంలో ఆదివారం ఠాగూర్ 162వ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోబెల్ బహుమతి సాధించిన ఘనత ఠాగూర్‌కే దక్కుతుందని కొనియాడారు. విద్యను నాలుగు గోడలకే పరిమితం కాకూడదని, సహజసిద్ధమైన వాతావరణంలో విద్యనందించడానికి శక్తివంచన లేకుండా రవీంద్రనాథ్ ఠాగూర్ కృషి చేశారని కొనియాడారు. నేటి యువత ఠాగూర్ ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. అంతకు ముందు ఠాగూర్ చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి తాతపూడి జయశ్రీ, సభ్యులు పి.వి.కిరణ్మయి, ఎస్.లక్ష్మి, ఎ.ఉదయ్‌కిరణ్, ప్రవళిక, రమేష్ పాల్గొన్నారు.

దుర్గాదేవి సారె ఊరేగింపు

అనకాపల్లిటౌన్ : స్థానిక రజకవీధి దుర్గాదేవి ఆలయ 8వ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం సాయంత్రం అమ్మవారి సారె ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. పలు రకాల పిండివంటలు, మిఠాయిలు, అరటిపళ్లు, పసుపు, కుంకుమలను మహిళలంతా తలపై మోసుకుని ఊరేగించారు. పురవీధుల గుండా అమ్మవారి ఆలయానికి చేరుకుని సారెను అమ్మవారికి నివేదించారు. వార్షికోత్సవ కార్యక్రమాలు సోమవారం ఉదయం నుంచి ప్రారంభంకానున్నాయి.

గౌరీపరమేశ్వరుల వార్షికోత్సవ ఏర్పాట్లు

అనకాపల్లిటౌన్ : స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. 14న 108 కలశాలతో అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజలు, 15న గౌరీపరమేశ్వరుల కల్యాణోత్సవం, అన్నసమారాధనకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు



కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో వేసవి ప్రత్యేక శిక్షణ తరగతులు

కశింకోట : స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది టెన్త్‌కి వెళ్లనున్న విద్యార్థులకు వేసవి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గణితం, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో సంబంధిత ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. తల్లిదండ్రుల అంగీకారం తీసుకుని ప్రారంభించిన తరగతులు ఈ నెల 20 వరకు కొనసాగుతాయని హెచ్‌ఎం ఎ.శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

అనకాపల్లి సినిమాలు

అరంగేట్రం	రాజా
రామబాణం	సత్యనారాయణ స్క్రీన్-1
గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ (తెలుగు 3డి)	సత్యనారాయణ స్క్రీన్-2
పీఎస్-2	షిర్డీసాయి
విరూపాక్ష	పర్తిసాయి
రుద్రుడు	వెంకటేశ్వర
ఉగ్రం	శ్రీసత్య
ఏజెంట్	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 36 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-8 యూనిట్లు, ఓ పాజిటివ్-20 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 361 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 294 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (9441108144)ని సంప్రదించవచ్చు.

పది ఫలితాల్లో సత్తా చాటిన సర్కారీ స్కూళ్లు

- గతేడాది కంటే మెరుగైన ఫలితాలు
- కార్పొరేట్ స్కూళ్లను మించిన మార్కులు



పట్టణ టాపర్లుగా నిలిచిన జీవీఎంసీ పట్టణ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు



సీహెచ్ రేణుక(582) గాంధీనగరం హైస్కూల్

అనకాపల్లిటౌన్/కశింకోట : నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ స్కూళ్లు టెన్త్ ఫలితాల్లో సత్తా చాటాయి. ఉత్తీర్ణతా శాతంలో గతం కంటే మెరుగయ్యాయి. అత్యుత్తమ మార్కులు సాధించడంలో కూడా కార్పొరేట్ స్కూళ్లను మించి, ఫలితాలు సాధించాయి. మండలాలవారీగా, పట్టణ పరిధిలో కూడా సర్కారీ విద్యార్థులే టాపర్లుగా నిలవడం విశేషం.

- ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన టెన్త్ పరీక్షా ఫలితాల్లో పట్టణంలోని జీవీఎంసీ యాజమాన్యంలో నడుస్తున్న ఆరు స్కూళ్లలో 557 మంది విద్యార్థుల్లో 397(71.27 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు.
- జీవీఎంసీ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు డి.హన్షిత(587), పి.పూర్ణిమ(585), గాంధీనగరం హైస్కూల్‌కు చెందిన సీహెచ్ రేణుక(582) అత్యుత్తమ మార్కులతో పట్టణ టాపర్లుగా నిలిచారు.
- మండలంలోని 11 హైస్కూళ్లలో 775 మంది విద్యార్థులకుగాను 550(70.97 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. అత్యుత్తమ మార్కుల సాధనలో కూడా వీరు ప్రతిభ కనబరిచారు.
- కశింకోట మండలంలోని 10 జెడ్పీ స్కూళ్లతోపాటు, ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులం, కేజీబీవీ ఉన్నాయి. వీటిలో 931 మందికి, 621 మంది ఉత్తీర్ణులయ్యారు. గతేడాది 64 శాతం ఉండగా, ఈసారి ఉత్తీర్ణతా శాతం 67కు పెరిగింది.
- డీపీఎన్ జెడ్పీ హైస్కూల్ గతం(42 శాతం)లో కంటే ఇపుడు(68 శాతం) 26 శాతం మెరుగైన ఫలితాలు సాధించింది. మండలంలో 576 మార్కులతో టాపర్లుగా నిలిచిన కొవ్వాడ మోక్షిత, దొకుల బిందు ఈ స్కూల్ విద్యార్థులే.
- తేగాడ ఆదర్శ పాఠశాల నుంచి 96 మంది పరీక్షలకు హాజరుకాగా 92(96 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. గతేడాది మండలంలో అత్యధిక ఉత్తీర్ణతా శాతం సాధించిన స్కూల్ ఇదే. గతేడాది కంటే 3 శాతం అధిక ఉత్తీర్ణత సాధించింది.

ఫలితమిచ్చిన ప్రత్యేక చర్యలు

ఈ ఏడాది పది ఫలితాలపై విద్యాశాఖతో పాటు, ప్రభుత్వం కూడా ప్రత్యేక దృష్టి పెట్టింది. ఎప్పటికప్పుడు జిల్లా విద్యాశాఖాధికారుల్ని అప్రమత్తం చేసింది. అందులో భాగంగానే గతంలో కంటే ముందుగానే పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల్ని ప్రారంభించారు. రోజువారీ స్లిప్ టెస్ట్‌లు నిర్వహించారు. వ్యక్తిత్వ వికాస నిపుణులతో అవగాహన సదస్సులు నిర్వహించారు. దాదాపు అన్ని స్కూళ్లలో చదువులో వెనుకబడిన విద్యార్థుల్ని ఉపాధ్యాయులు దత్తత తీసుకుని మరీ చదివించారు. రాత్రుళ్లు ఇంటి వద్ద చదువుతున్నారో? లేదో? తెలుసుకునేందుకు టీచర్లు ఆకస్మిక తనిఖీలు కూడా చేశారు. తల్లిదండ్రుల్లో బాధ్యత పెంచారు. ఇవన్నీ ప్రస్తుత ఫలితాలకు కారణంగా అధికారులు చెప్తున్నారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం



విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, వారి పట్ల అధిక శ్రద్ధ తీసుకున్నాం. అందుకే ఉత్తీర్ణత అనూహ్యంగా పెరిగింది. మండలంలో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులు మా స్కూల్ వారే కావడం ఆనందంగా ఉంది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారంతోనే ఉత్తమ ఫలితాలు సాధించాం. ఇదే స్ఫూర్తిని ఇకముందు కూడా కొనసాగించేలా చర్యలు తీసుకుంటాం.

–ఎ.శ్రీధర్‌రెడ్డి, హెచ్‌ఎం, డీపీఎన్ జెడ్పీ హైస్కూల్, కశింకోట

సమష్టి విజయం



కశింకోట మండలంలోని స్కూళ్లన్నింటిలో అత్యధిక శాతం మంది ఉత్తీర్ణత సాధించిన స్కూల్‌గా నిలివడం ఆనందంగా ఉంది. ప్రభుత్వ ఆదర్శ పాఠశాల గతంలో కూడా మెరుగైన ఫలితాలు సాధించింది. గతేడాది కంటే ఈసారి 3 శాతం పెరిగి 95.8 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సిబ్బంది సమష్టి కృషితోనే సాధించగలిగాం.

–ఐ.మార్తాతిలకం, ప్రిన్సిపాల్, ఆదర్శ పాఠశాల, తేగాడ, కశింకోట

ఫలితాల వెనుక టీచర్ల శ్రమ

అనకాపల్లి పట్టణం, మండలంలో 17 హైస్కూళ్లున్నాయి. 1352 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 947(70 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు వచ్చాయి. దీని వెనుక ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల ఉంది. విద్యాశాఖ ఆదేశాలతో ఉపాధ్యాయులు చిత్తశుద్ధిగా ప్రత్యేక తరగతులు నిర్వహించారు. పరీక్షలకు ముందు ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరూ తమ సొంత బిడ్డల్లానే చూసుకున్నారు. ఈ ఫలితాల వెనుక ఉపాధ్యాయుల శ్రమ చాలా ఉంది.

– డి.దివాకర్, ఎంఈవో, అనకాపల్లి

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తజనం



ఆలయ ముఖద్వారం వద్ద భక్తుల తాకిడి



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి హాజరుకావడంతో ఆలయంలో క్యూలైన్లు కిటకిటలాడాయి. వేసవి సెలవులు కావడం, పదో తరగతి, ఇంటర్ ఫలితాలు విడుదల కావడంతో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు, కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తులు ఆలయ ఆవరణలో ఉన్న చలువ పందిళ్లలో వంటలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కుటుంబ సమేతంగా భోజనాలు చేసి అమ్మవారి ఆశీస్సులు పొంది, ఆనందంగా తిరుగుముఖంపట్టారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీరు అందించారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ సౌకర్యాలను కల్పించారు. పట్టణ సీఐలు దాడి మోహనరావు, టి.శ్రీనుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

చెప్పిన పనులన్నీ చేశాకే ఓట్లడుగుతా

- గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి అమర్‌నాథ్
- రూ.1.29 కోట్లతో ఏఎంఏఎల్ కళాశాల–మూలపేట రోడ్డు
- రహదారులు, డ్రైనేజీలకు రూ.30 లక్షలు విడుదల



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి అమర్‌నాథ్



లబ్ధిదారునికి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : 'చెప్పిన ప్రతి పని చేశాకే మీ దగ్గరికి వచ్చి ఓట్లు అడుగుతా.. పనిచేయకపోతే మీరు నాకు ఓటేయొద్దు'అని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని సత్యనారాయణపురం పంచాయతీ పరిధి మూలపేటలో ఆదివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాలపై రూపొందించిన బ్రోచర్లను స్థానికులకు అందించారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి నుంచి మూలపేటకు వచ్చే ప్రధాన రహదారి నిర్మాణ పనులు త్వరలో చెపట్టనున్నట్లు తెలిపారు. ఏఎంఏఎల్ కళాశాల జంక్షన్ నుంచి మూలపేట రహదారికి రూ.కోటి 29 లక్షలతో చేపట్టనున్న పనులకు రెండు రోజుల క్రితం శంకుస్థాపన చేశామని, రహదారి విస్తరణకు కాంట్రాక్టర్లను నియమించినట్లు వెల్లడించారు. గ్రామంలో రహదారులు, డ్రైనేజీ నిర్మాణానికి సచివాలయ నిధుల నుంచి రూ.20 లక్షలు, మంత్రి నిధుల నుంచి రూ.10 లక్షలు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పట్టణ, గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కుళాయిల్ని దశల వారీగా ఏర్పాటు చేస్తామని భరోసానిచ్చారు. గ్రామ ప్రజల కోరిక మేరకు గంగాలమ్మతల్లి ఆలయ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. రానున్న రోజుల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుని రాష్ట్ర అభివృద్ధికి ప్రజలు సహకరిస్తామని చెప్పడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందన్నారు.

అంతకుముందు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని అల్లూరి చిత్రపటానికి మంత్రి అమర్‌నాథ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్, సర్పంచ్ పలకా భాగ్యలక్ష్మీ, ఎంపీటీసీ మజ్జి అలివేణి, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలు చవ్వాకుల ఈశ్వరరావు, బంటు సత్యారావు, రమేష్, పప్పల జగన్నాథరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అల్లూరి పోరాటం యువతకు ఆదర్శం



తుమ్మపాలలో అల్లూరి విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న సీపీఐ నేతలు



గూడ్స్‌రోడ్‌లో అల్లూరి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న బీజేపీ నేతలు

అనకాపల్లిటౌన్ : స్థానిక గూడ్స్‌రోడ్డు వద్ద మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమాలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగాయి. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో విప్లవ వీరుడు సీతారామరాజును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోయిన భానుమూర్తియాదవ్ మాట్లాడుతూ బ్రిటీష్ పాలకుల వెన్నులో వణుకు పుట్టించిన మహావీరుడు సీతారామరాజు అని కొనియాడారు. మండలంలోని మేజర్ పంచాయతీ తుమ్మపాలలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27 సంవత్సరాల యుక్తవయస్సులోనే దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన యోధుడు సీతారామరాజు అని కొనియాడారు.

ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు



పదోతరగతి ఫలితాల్లో పట్టణ టాపర్‌గా నిలిచిన హర్షితను సత్కరిస్తున్న కోటిపల్లి జేజిబాబు

అనకాపల్లిటౌన్ : కష్టపడి చదివే కంటే ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అనకాపల్లి విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కోటిపల్లి జేజిబాబు అన్నారు. గవరపాలెం కస్పావీధికి చెందిన దోసూరు హర్షిత టెన్త్ ఫలితాల్లో 587 మార్కులు సాధించి పట్టణ టాపర్‌గా నిలిచిందుకు, సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థినిని శాలువాతో సత్కరించి అమ్మవారి ఫొటోను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలల్ని కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసి, బోధనలో నిరంతర పర్యవేక్షణ పెంచడం వల్లే ఈ ఏడాది ఉత్తమ ఫలితాలను సాధించినట్లు పేర్కొన్నారు. భావితరాల భవిష్యత్‌కు అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు చేయడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయుల నిబద్ధత, ప్రత్యేక తరగతులు ఉత్తమ ఫలితాలకు కారణమన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కొమ్మోజు గోవిందరాజు, కోశాధికారి పొన్నాడ పెదబాబు, విద్యార్థి తల్లిదండ్రులు దోసూరి లీలామోహన్, వరలక్ష్మి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం



తాళ్లపాలెం శాఖా గ్రంథాలయం వద్ద వేసవి విజ్ఞాన శిబిరం పోస్టర్ల ఆవిష్కరణ

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం తెలిపారు. జూన్ 11 వరకు కొనసాగే ఈ శిబిరంలో కథలు వినుట, పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్ వంటి కార్యక్రమాలుంటాయన్నారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పోస్టర్ల ద్వారా ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ పోస్టర్‌ను వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్ ఆవిష్కరించారు. ఆర్మీ ఉద్యోగి ఎం.రవికిరణ్, ఉపాధ్యాయుడు సురేష్, పంచాయతీ కార్యదర్శి ఎం.మహేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కె.దేముడుబాబు పాల్గొన్నారు.

రామాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: దేశపాత్రునిపాలెంలో శ్రీ సీతారాముల ఆలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 79 వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, నాయకులు కర్రి వినోద్, డీవీ రమణ, అచ్యుతరావు, రాధాకృష్ణ, ప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.

దేవీపురం క్షేత్రంలో ప్రత్యేక పూజలు



అమ్మవారిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్కాపురంలోని జనతాకాలనీలో జయదుర్గ పీఠాన్ని గురుజీ అమృతానంద స్వామీజీ 20 సంవత్సరాల కిందట స్థాపించారు. నాటి నుంచి ఏటా మే 7వ తేదీన అక్కడి భక్తులు జయదుర్గా అమ్మవారిని ఊరేగింపుగా దేవీపురంలోని పుట్టింటికి తీసుకురావడం ఆనవాయితీగా జరుగుతుంది. దీనిలో భాగంగా మరియ దాసు, ఆడారి అప్పారావు తదితరులు కమిటీ తరఫున వచ్చి అమ్మవారికి క్షీరాభిషేకం, షోడశోపచార పూజ, లలితా సహస్రనామ పారాయణం చేయించారు. ఇటు వంటి కార్యక్రమాలు మంచి జరిగేందుకు దోహదపడటంతోపాటు, ప్రపంచ శాంతికి దారితీస్తాయని గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. సాయంత్రం మళ్లీ జయదుర్గా అమ్మవారిని పల్లకీలో ఊరేగింపుగా మల్కాపురంలోని జనతా కాలనీకి తీసుకువెళ్లారు.

నిత్యావసర సరకుల పంపిణీ

సబ్బవరం: మండలంలోని రావులమ్మపాలెం గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం గొటివాడ కాలనీలోని 30 నిరుపేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులను ట్రస్ట్ చైర్మన్ పువ్వల విజయకుమార్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి నెలా 30 మంది నిరుపేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

సండే సందడి



తిక్కవానిపాలెం తీరంలో సందర్శకులు

పరవాడ: తిక్కవానిపాలెం తీరం ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు జీడి తోటలు, చెట్ల నీడన, టెంట్లు, వంతెన దిగువ కాలక్షేపం చేశారు. సాయంత్రం ఇసుక తిన్నెలపై కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ వంటి ఆట పాటలతో ఎంజాయ్ చేశారు. సాయంత్రం తీరంలో జలకాలాటలతో సరదాగా గడిపారు.

182 మందికి కంటి పరీక్షలు



కంటి వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అనకాపల్లి రూరల్ : మండలంలోని గోపాలపురంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. దీనిని ప్రారంభించిన ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కంటి సంబంధిత సమస్యలపై పట్ల జాగ్రత్త వహించాలన్నారు. శంకర్ ఫౌండేషన్, రాజా ఆప్టికల్స్ సంయుక్తంగా నిర్వహించిన వైద్యశిబిరంలో 182 మందికి వైద్య పరీక్షలు చేయగా, 30 మందికి కేటరాక్ట్ శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. రోగులకు తాటికొండ జీవన్ ఆర్థిక సహాయంతో వైద్య శిబిరంలో అవసరమైన ఔషధాలను అందించారు. కళ్ల జోడు అవసరమైన వారికి అనకాపల్లి రాజా ఆప్టికల్స్ ప్రతినిధులు 50 శాతం రాయితీతో ఇచ్చారు. శిబిరంలో జెర్రిపోతుల కృష్ణ, కరణం సత్యనారాయణ, గొర్లి తాతారావు, గొర్లి భాను, గోవాడ మహేష్, సేనాపతి శ్రీనివాసరావు, శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు, వైద్యులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గవరపేట దేవతమ్మ ఉత్సవం



కశింకోటలోని గవరపేటలో వెలసి ఉన్న దేవతమ్మ

కశింకోట : స్థానిక గవరపేటలో వెలసిన దేవతమ్మ ఉత్సవాన్ని పెద్ద ఎత్తున సోమవారం నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. రెండేళ్లకోసారి నిర్వహించే ఈ ఉత్సవంలో జిల్లాలోని వేగి ఇంటి పేరున్న వారితోపాటు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొంటారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఉదయం సిద్ధుల వేషం, అనంతరం పంచ రంగులతో చక్రాకారంలో వేసే ముగ్గు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. దీన్ని వేగి కుటుంబీకులు సంప్రదాయంగా పెడతారు. తర్వాత అమ్మవారిని ఊరేగించి శారదానదిలో నిమజ్జనం చేయడంతో ఉత్సవం ముగుస్తుంది. ఉత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవంలో భాగంగా ఆదివారం సంప్రదాయంగా మేకను జోల పాట పాడి నిద్రింపజేశారు. స్థానికులు ఆసక్తిగా తిలకించారు. అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణ ప్రారంభం

సబ్బవరం : సబ్బవరం శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి వచ్చే నెల 11వ తేదీ వరకూ వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు సబ్బవరం శాఖా గ్రంథాలయ అధికారి వి. కుమారి శిరీష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్రలేఖనం, కథల పోటీలు తదితర అంశాల్లో తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి



సమావేశంలో పాల్గొన్న ధర్మ ప్రచారక్ సాయిరాం

పరవాడ: హిందూ ధర్మాన్ని రక్షించే బాధ్యత గ్రామ ధార్మిక జట్లపై ఉందని సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర ధర్మ ప్రచారక్ ముద్దు సాయిరాం అన్నారు. వాడచీపురుపల్లి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఫౌండేషన్ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాలయాల కేంద్రంగా పౌర్ణమి రోజు సామూహిక హారతి, ఏకాదశికి నగర సంకీర్తన, వారానికి ఒక సారి భజన, ఇంటింటా ధర్మ ప్రచారం గ్రామాల్లో నిర్వహించడం ద్వారా భక్తి భావం పెంపొందించడం సాధ్యపడుతుందని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు ఆడారి గంగాధర్, కర్రి రాజు, దాసరి రాము, వెన్నల అప్పలనాయుడు, బీసీ సంక్షేమ సంఘ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కూండ్రపు కృష్ణంనాయుడు, ప్రతినిధులు ఉమామహేశ్వరి, వెంకునాయుడు, కె.అప్పలనాయుడు, లాలం ఈశ్వరరావు పాల్గొన్నారు.